విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 17 ఆగస్టు 2025 | 8 పేజీలు

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం

- కార్మికులకు వేతనాలు చెల్లించడంలో వింతపోకడలు
- పంచాయితీరాజ్‌పై నెట్టేస్తున్న అధికారులు
- కార్మికుల కష్టాలను పట్టించుకోరా...?
- సీహెచ్ కోటేశ్వరరావు మండిపాటు

విశాలాంధ్ర-విజయవాడ: దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టు కార్మికుల పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యహారిస్తున్నారు. నిబంధనలు మేరకు సకాలంలో చెల్లించవలసిన వేతనాలు చెల్లించకుండా దాటవేత దోరణిని అలవంభిస్తూ కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తమకు ఎటువంటి సంబంధంలేదు పంచాయితీరాజ్‌తో మాట్లాడుకోండని అహంకారంతో సమాధానం ఇవ్వడంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టపరిధిలో ఉన్న ప్రిన్సిపల్ ఎంప్లాయిర్‌గా ఉన్న డిపార్టుమెంట్ వేతనాలు చెల్లించవలసి ఉండగా ఎటువంటి సంబంధంలేని పంచాయితీరాజ్‌తో మాట్లాడండి అని చెప్పడం చట్టాన్ని అతిక్రమించడమేనని మండిపడ్డారు. అంతంతమాత్రం ఉన్న వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడానికి నకరం అనుభవిస్తున్న కార్మికుల ఆకలికేకలు ఏసీల్లో ఉన్న అధికారులకు వినపడకోవడం దురదృష్టకరమన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తే సహించేదిలేదని రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. శనివారం ఇబ్రహంపట్నం యూనియన్ కారాల్యయంలో జరిగిన ఉమ్మడికృష్ణా జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్‌డబ్ల్యుఎస్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు దశాబ్దాల తరబడి పనిచేస్తున్నారని తెలిపారు. కోట్లాది మంది ప్రజల కోసం రేయింబవళ్ళు శ్రమించి త్రాగునీరు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్మికులకు మిగతా 2 లో

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

- జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ఈ నెల 17, 18 తేదీలలో జరుగనున్న సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17న మధ్యాహ్నం 3 గం టలకు గుంటూరు బీఆర్ స్టేడియం నుంచి సీపీఐ కార్యాలయం వరకు భారీ ప్రజాప్రదర్శన జరుగబోతుందని వెల్లడించారు. 18న ప్రతినిధుల సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో జిల్లా నూతన నాయకత్వం, కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితర నాయకులు మిగతా 2 లో

జిల్లా మహాసభలకు సర్వం సిద్ధం

- నేడు ప్రజాప్రదర్శన, బహిరంగ సభ
- రేపు నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : భారత కమ్యూనిస్టు పార్టీ గుంటూరు జిల్లా 26వ మహాసభలకు గుంటూరు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రెండు రోజులపాటు జరుగ నున్న మహాసభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సభల విజయవంతానికి పార్టీ శ్రేణులు విశేష కృషి చేస్తున్నారు. నగరంలోని ప్రధాన రహ దారులు, ప్రధాన సర్కిళ్లను ఎర్రటి తోరణాలతో అలంకరించారు. మహాసభలకు హాజరుకానున్న ముఖ్యఅతిధులకు స్వాగతం పలుకుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా కార్యాలయం తోరణాలు, స్వాగత ప్లెక్సీలతో కళకళలాడుతోంది. అరుణ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. మహా సభల సందర్భంగా 17వ తేదిన మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు బ్రహ్మానంద రెడ్డి(బీఆర్) స్టేడి యం నుంచి ప్రజాప్రదర్శన నిర్వహించనున్నారు. పాతగుంటూరు, జిన్నాటవర్, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, నాజ్ సెంటర్, పశువుల హాస్పిటల్ మీదుగా పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి ప్రదర్శన చేరుకుంటుంది. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వ హించనున్నారు. 18వ తేదిన ప్రతినిధుల సభ జరుగనుంది. ఈ సభలో నూతన నాయకత్వం, కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యంగా జిల్లా మహాసభలు జరుగబోతున్నాయని నాయకులు వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు మహాసభలలో చర్చించి తీర్మానాలు రూపొందించనున్నారు. జిల్లా ప్రజల మెరుగైన జీవనశైలికి ఈ మహాసభలు దోహదపడ తాయని తెలియజేస్తున్నారు. ప్రజా సమస్యల పరి ష్కారం, అమరావతి అభివృద్ధి, రైతాంగం ఎదుర్కొం టున్న ఇబ్బందులపై పోరాటానికి ఈ మహాసభలలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు తెలియజేశారు.

ఛాయాచిత్రం కళాత్మక సందేశం



కలెక్టర్ లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: ఫొటోగ్రఫీ పోటీల్లో ఔత్సాహిక ఫొటో గ్రాఫర్లు పంపిన ఛాయా చిత్రాలు కళాత్మక సందేశాన్ని అందిస్తున్నాయని కలెక్టర్ జి లక్ష్మీశ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలైన ఫోటోగ్రాఫర్లను అభినందించారు. మొదటి విభాగమైన పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో జీఎన్ రావు (ది హిందూ), సీహెచ్‌వీ మస్తాన్ (ది హాన్స్ ఇండియా), కేవీఎస్ గిరి (ది హిందూ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. సి.మల్లికార్జున్ (ఈనాడు), పి.రాజేష్ (ఆంధ్రజ్యోతి), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్), సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), పి.ప్రసాద్ (ఎస్‌డీఎంఎస్‌డీ), ఎస్ఎస్ విజయబాబు (టైమ్స్ ఆఫ్ ఇండియా) ప్రోత్సాహక బహుమతులు సాధించారని వివరించారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు చెందిన ఫొటోల్లో ఎ.రాజేంద్రప్రసాద్ (ఐ అండ్ పీఆర్), జీఎన్ రావు (ది హిందూ), ఆర్‌వీ అప్పారావు (ఫ్రీలాన్సర్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. కేవీఎస్ గిరి (ది హిందూ), ఎ.రామచంద్రరావు (ప్రజాశక్తి), బి.మరిడయ్య (ఈనాడు), వైవీవీ మిగతా 2 లో

హక్కులు సాధనకు ఐక్యంగా పోరాడాలి: సీపీఐ

విశాలాంధ్ర-రెంట చింతల : హక్కులు సాధనకు ప్రతి కార్మి కుడు ఐక్యంగా పోరా డాలని, కార్మికులు సంఘంగా ఏర్పడితేనే హక్కులు సాదించుకోవచ్చని పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుసేన్ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ మండల కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షతన నిర్వహించిన ప్రవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మిగతా 2 లో

హాలివుడ్ సినిమాలకు యానిమేషన్ పేరుతో మోసం - 2లో

2027నాటికి శాశ్వత అసెంబ్లీ నిర్మాణం పూర్తి - 3లో

మొదటిపేజీ తరువాయి

నిర్లక్ష్యం

తక్కువ వేతనాలు అది కూడా సకాలంలో అందక కుటుంబాలు గడవక నరకవేతన అనుభవిస్తూ విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లింపు, ఇపియఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పన విషయమై రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, ఇతర సమస్యలతో తమకు ఎలాంటి సంబంధంలేదని , పంచాయితీరాజ్ శాఖతో మాట్లాడుకోండని అనడం నిబంధనలకు తూట్లుపొడవడమేనని అన్నారు. కాంట్రాక్టు లేబర్ యాక్టు 1970 ప్రకారం వేతనాతలు సకాలంలో కల్పించడంలో విఫలమైనప్పుడు ప్రిన్సిపల్ ఎంప్లాయర్ అయిన డిపార్ట్మెంట్ బాధ్యత వహించాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఈ చట్టపరమైన హక్కులు సక్రమంగా అమలు కోసం ఉద్యమాలకు సన్నద్ధంకావాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

జిల్లా మహాసభలు

హాజరుకానున్నట్లు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అమరావతి అభివృద్ధి, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పోరాటానికి ఈ మహాసభలలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆదివారం జరుగనున్న ప్రజాప్రదర్శన ర్యాలీకి గుంటూరు నగరంలో ఉన్న పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, షేక్ వలి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఛాయాచిత్రం కళాత్మక సందేశం

సత్యనారాయణ (ఈనాడు), సంపత్ కుమార్ (ఈనాడు), ఎంపీఎస్కే దుర్గాప్రసాద్ (ఈనాడు)లు ప్రోత్సాహక బహుమతులు సాధించారు. మూడో విభాగంలో బెస్ట్ న్యూస్ పిక్చర్లో సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), జి.మహేశ్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్ప్రెస్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జీవీ నారాయణ (ఆంధ్రజ్యోతి), ఎన్.కిశోర్ (సాక్షి), బి.మరిదయ్య (ఈనాడు), కె.చక్రపాణి (సాక్షి), డి.లక్ష్మణ్ (ఆంధ్రజ్యోతి), బి.సతీష్కుమార్ (ఆంధ్రజ్యోతి)లు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు కలెక్టర్ లక్ష్మీశ ప్రకటించారు. విజేతలకు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన న్యాయ నిర్ణేతలు కె.రవి, సీహెచ్ విజయభాస్కర్, జి.అనిత, టి.శ్రీనివాస్రెడ్డి, డి.సీతారాం, కె.రవికుమార్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో కేవీ రమణరావు, డీఈఆర్వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఏపీఎస్ వీవీ ప్రసాద్, సీనియర్ ఫొటోజర్నలిస్టు సీహెచ్ విజయభాస్కర్, వివిధ ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాలి

కార్మికుడి హక్కుల సాధనకు సంఘం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్మికుల శ్రమకు తగ్గ వేతనం పొందడంతో పాటు దోపిడీ నివారించవచ్చన్నారు. ఐక్యమత్యంతో ప్రవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు ముందుకు వచ్చి యూనియన్ ఏర్పడటం సంతోషకరమన్నారు. అనంతరం గౌరవ అధ్యక్షులుగా సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు అధ్యక్షులు జానీభాష, ఉపాధ్యక్షులు రాజారావు, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి కోటిరెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బారెడ్డిలతో నూతన యూనియను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వెంకటరావు పాల్గొన్నారు.

ఇస్కాన్ పర్యాటక హబ్

- శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: ఇస్కాన్ విజయవాడ ఆధ్వర్యంలో రామలింగేశ్వర నగర్ శ్రీ జగన్నాథ్ మందిర్,ఉండవల్లి కరకట్ట వద్ద శ్రీ రాధ శ్యామ్ సుందర్ మందిరాలలో శ్రీకృష్ణజన్మాష్టమి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని జగన్నాథ్ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శివ నాథ్, రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ ఇస్కాన్ మందిరాల వారు అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేస్తుంటారని, భక్తుల ఆదరణతో నగరం భక్తితత్వాన్ని పెంపొందిస్తున్నారు. అందుకే విజయవాడ ఇస్కాన్ ఆధ్యాత్మిక పర్యా టక హబ్గా రూపొందుతుందన్నారు. ముందుగా భక్తులకు, ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

మూల్యాంకనంతో ముప్పతిప్పలు

- గురువుల నెత్తిన అదనపు భారం

విశాలాంధ్ర - విస్సన్నపేట : విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గేలా పలు చర్యలు తీసుకుంటున్నామంటూ ఒకవైపు ప్రకటనలిస్తున్న ప్రభుత్వం ఈ బరువును గురువుల నెత్తిన పెట్టే ప్రయత్నం చేస్తోందా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయంలోకి వెళితే...రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాల్లో ఈనెల 11వ తేదీ నుంచి ఎఫ్.ఎ-1(ఫాసెవ్ అసెస్మెంట్) పేరుతో పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనాన్ని తాము ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తి చేసేలా ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్.ఎ-1 పరీక్షలకు సంబంధించి గతం నుంచి పేపర్లలో పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది కొత్త విధానంలో బుక్లెట్లను ప్రవేశపెట్టింది. ఈ విధా నంలో ప్రతి విద్యార్థికి ఒక బుక్లెట్ అందించి, దీనిలోనే ప్రశ్నలకు సమాధానాలు రాసేలా చర్యలు తీసుకున్నారు. ఈ విధా నమే ఇప్పుడు ఉపాధ్యాయులకు సమస్యగా మారుతోంది. గతంలో పరీక్షలు నిర్వహించిన సందర్భాల్లో ఉపాధ్యాయులు పరీక్షాపత్రాలను బడిలో ఖాళీగా ఉన్న సమయంలో, అలా సమయం దొరకని పక్షంలో ఇంటికి తీసుకెళ్లి మరీ మూల్యాంకనాన్ని గడువులోగా నిర్వహించారు. తాజా విధానంలో పెద్దఎత్తున ఉన్న బుక్లెట్ బండిళ్లను ఇంటికి తీసుకెళ్లి, జవాబులు రాసిన ఓఎంఆర్ షీట్లను పరిశీలించటం భారంతో కూడుకున్న పనిగా మారింది. ఒక్క పదవ తరగతి విద్యార్థికే 11 బుక్లెట్లు అందించారు. దీనికి తోడు మూల్యాంకనం పూర్తి చేసిన ఆన్సర్ పుస్తకంలోని ప్రతి పేజీని స్కానింగ్ చేసి, విద్యాశాఖ సూచించిన లీప్ యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇంటి వద్ద కంప్యూటర్, స్కానర్ వంటి సాధనాలు, ఇందుకు సంబంధించిన అనుభవం ఉపాధ్యాయులకు ఉండే అవకాశం అంతంతమాత్రమే కావటంతో అందరూ పాఠశాలలోనే మూల్యాంకన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. కనీసం విద్యార్థి మూడు పేజీల సమాధానాలు రాసినా, వంద నుంచి 120 పేజీలు స్కానింగ్, అప్లోడ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇదంతా ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఉపాధ్యాయులు పూర్తి చేయాలంటే ప్రత్యేకంగా బోధన పక్కన పెట్టి, ఇదే పని చేపట్టినా, కనీసం వారం నుంచి పదిరోజులు ఈ పనులోనే గడిచిపోయేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు ఉపాధ్యాయసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒకరకమైన సమస్య కాగా, ప్రాథమిక స్థాయిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కొనసాగుతూనే ఉన్నాయి. వీరు 1 నుంచి 5వ తరగతి వరకు అన్ని తరగతుల విద్యార్థుల, అన్ని బోధనాంశాల ప్రశ్నాపత్రాలను ఒకే ఉపాధ్యాయుడు మూల్యాకనం చేసి, వీటిని స్కానింగ్, అప్లోడ్ ప్రక్రియలకు మరింత భారంగా మారనుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయకుంటే భవిష్యత్తులో ఉపాధ్యాయవర్గాలు ఆందోళన బాట పట్టేందుకు ఆస్కారం లేకపోలేదనే అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమవుతోంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర- విజయవాడ: మొగల్రాజపురం జూబ్లీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని విద్యుత్ మరమ్మత్తులు, సర్దుబాటు కారణంగా ఆది వారం ఉదయం 8 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీ డీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ రవీంద్రబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేడి యం రోడ్డు, గిరిపురం, బందర్ రోడ్, సబ్ కలెక్టర్ ఆఫీస్ ఏరియా, మాంటిసోరి కాలేజీ రోడ్డు, పున్నమ్మ తోట, స్వగృహ ఫుడ్స్ ఏరియా, అమెరికన్ హాస్పిటల్ రోడ్, ఆకాశ వాణి, దూరదర్శన్, తిరుమల తిరుపతి దేవస్థానం, రైల్వే సర్వీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న కారణంగా వినియోగదారులు సహకరిం చాలని కోరారు.

-సూర్యారావుపేట సెక్షన్ పరిధిలో

సూర్యారావుపేటి సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మ త్తులు, సర్దుబాటు కారణంగా ఆదివారం ఉదయం 7.30 నుండి 11గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యానిరహణ ఇంజనీర్ రవీంద్రబాబు తెలిపారు.

11 కేవీ దోర్నకల్ రోడ్ ఫీడర్ పరిధిలోని గోపాలరెడ్డి రోడ్ సాయిరామ్ హోటల్ ఏరియా, నక్కలరోడ్డు ఆంధ్రా హాస్పిటల్ ఏరియా, స్టేట్ గెస్ట్ హస్, డిజిపి గారి క్యాంపు ఆఫీస్, సిఎస్ఐ (చర్చి) ఏరియా, కోర్ట్ బిల్డింగ్స్ ఏరియా, ప్రకాశం రోడ్డు, కాళేశ్వర రావు రోడ్ కొంతభాగం, మాదిరెడ్డి వారి వీధి, భవానీ వీధి, విష్ణువర్ధనరావు వీధి కొంతభాగం. 11 కేవీ విశా లాంధ్ర ఫీడర్ పరిధిలో విశాలాంధ్ర రోడ్, బ్రహ్మానందరెడ్డి అన్నిలైన్లు, ఇజ్జాడవారివీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, బాలాజీ వీధి, అంజనీ హోటల్ ఏరియా, గుడ్ మార్నింగ్ హోటల్ ఏరియా, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, దాసరి వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న కారణంగా వినియోగదారులు సహకరించాలని కోరారు.

హాలివుడ్ సినిమాలకు యానిమేషన్ పేరుతో మోసం

- ముగ్గురు నిందితులు అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): హాలివుడ్ సినిమాలకు యానిమేషన్ చేస్తామని కోట్ల రూపాయల పెట్టుబడుల సేకరించి, భారీ మోసం చేసిన ముగ్గురు నిందితులను విజయ వాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు బెజవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర బాబు వివ రాలను వెల్లడించారు. అరెస్టయిన వారిలో ప్రధాన నింది తుడు విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన నిడుమోలు కిరణ్(33)తో పాటు గుం టూరు జిల్లా కృష్ణానగరకు చెందిన మిట్టపల్లి రాజేంద్రబాబు(63), మిట్టపల్లి రాజీవ్ కృష్ణ(30) లను అరెస్టు చేశారు.

పెట్టుబడులు- లాభ నష్టాలు

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, 344 మంది సభ్యులు కలిపి మొత్తం రూ.592 కోట్లు ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టారు. 183 మంది రూ.353 కోట్లు పెట్టుబడి పెట్టి, కేవలం రూ.159 కోట్లు మాత్రమే తిరిగి పొందడంతో భారీగా నష్టపోయారు. 136 మంది రూ.238 కోట్లు పెట్టుబడి పెట్టి, రూ.358 కోట్లు వెనక్కి తీసు కుని లాభపడ్డారు. 25 మంది రూ.42కోట్లు పెట్టు బడి పెట్టి, లాభ నష్టాలు లేకుండా అదే మొత్తాన్ని తిరిగి పొందారు. ఏజెంట్లు కమిషన్ రూపంలో రూ.6,61 కోట్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. నింది తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ.90లక్షలు విలువైన 354 గ్రాముల బంగారు అభరణాలు, 21 కేజీల వెండీ, ఒకకారు, ఒక బైకు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. నిందితులను సంబంధించిన సుమారు రూ.23 కోట్లు విలువైన ఆస్తులను అటాచ్మెంట్ చేశారు. నిందితుడు కిరణ్ ఒక్కడే రూ.23 కోట్లు సంపా దించినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం వ్యవ హారంలో పెట్టుబడిదారులు ఎదుర్కొన్న నష్టం రూ. 201 కోట్లుగా నిర్ధారించారు. ఈ కేసులో మిగితా నిందితులపై కూడా దర్యాప్తు కొనసాగుతుందని, ఇలాంటి మోసపూరిత పెట్టుబడి పథకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చేధించడంలో కీలకంగా వ్యవహరించిన సిట్ అధి కారులను, సిబ్బందిని నగదు రివార్డులతో సత్క రించి పోలీస్ కమిషనర్ అభినందించారు.

భవిత సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర- విజయవాడ(వన్ టౌన్): విజయవాడ భవాని పురం విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌లో శ్రీ కృష్ణా ష్టమి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు గోపికల వేషధారణలతో అలరించారు సెంటర్ నందు కృష్ణుడి వేష ధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు అనంతరం ప్రిన్సిపల్ జె సునీత మాట్లాడుతూ భవానిపురంలో ప్రత్యేక అవసరతలు ఉన్న విద్యార్థుల కోసం మొట్టమొదటి సెంటర్ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు మాన సికంగా బలహీనంగా ఉన్న ప్రత్యేక అవసరతలు ఉన్న విద్యార్థులకు సెంటర్ నందు వారికి అవసరమైనటువంటి స్పీచ్ థెరపీ ఫిజియోథెరపీ ఆక్యుపేషన్ తెరపి వంటి సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు సెంటర్ నందు ప్రతి పండుగను వేడుకలు నిర్వహిస్తూ పిల్లల్లో చైతన్యాన్ని మానసిక పెంపుదలకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు సాధారణ పిల్లలుగా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను తీర్చిదిద్దడమే భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ఉద్దేశమని ఆమె తెలిపారు సెంటర్ సేవల కొరకు 9985 951397 నెంబర్ను సంప్రదించాలని ఆమె కోరారు కార్యక్రమంలో సెంటర్ అధ్యాపక బృందం ప్రత్యేక అవసరమున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

2027నాటికి శాశ్వత అసెంబ్లీ నిర్మాణం పూర్తి

- అమరావతి ఉద్యమ పోరాటంలో బాలకోటయ్య పాత్ర కీలకం
- 'నేను నా అమరావతి' పుస్తకావిష్కరణలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

విశాలాంధ్ర - విజయవాడ : అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నా యని, వచ్చే 2027నాటికి శాశ్వత అసెంబ్లీ నిర్మాణం పూర్తి అవుతోందని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రకటించారు. అమరావతి బహుజన ఐక్య వేదిక అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య రచించిన నేను నా అమ రావతి పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఘనంగా జరిగింది. టీడీపీ రాజకీయ కార్యదర్శి టిడి జనార్ధన్ అధ్యక్ష తన వహించిన ఈ కార్యక్రమానికి రఘురామకృష్ణ రాజు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్క రించారు. అనంతరం జరిగిన సభలో ఆయన గత ప్రభుత్వ 5 సంవత్సరాల పాలనలో అమరావతి రాజధానిపై విషం చిమ్మారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మనకంటు ఒక రాజధాని ఉందని భరోసాను సీఎం చంద్రబాబు ప్రజల్లో కల్పించారని తెలిపారు. ప్రజల ఆకాంక్ష లకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలి పారు. రాజధాని ఉద్యమంలో బాలకోటయ్య పోటా ర పటిమ ప్రశంసనీయమన్నారు. సుదీర్ఘంగా కొన సాగిన ఈ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని స్ఫూర్తితో అమరావతి రాజధాని ఉద్యమం అహింసవాదంలో సాగిందన్నారు. అప్పటి ప్రభుత్వ నిర్వాహకంతో ఉద్యమాన్ని అణిచివేయాలని ఎన్ని కుట్రలు పన్నినా సుదర్ఘంగా పోరాడిన ఘనతే ఉద్యమకారులకు దక్కుతుంద న్నారు. ముఖ్యంగా ఉద్యమంలో కీల కంగా వ్యవహరించిన బాలకోటయ్య రచిం చిన నేను నా అమరావతి పుస్తకం రాబోయే తరాలకు స్ఫూర్తిని నిస్తోం దన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం దాష్టికంతో ఇప్పటికి సింగపూర్ నుండి పెట్టుబడులు రాని పరిస్థితి ఉందన్నారు. అనంతరం అమరావతి ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తులసిరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త పాములపాటి వెంకట శేషయ్య, అమరావతి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పువ్వాడ సుధాకర్, అమరావతి కేసుల న్యాయవాది ఉన్నం మురళీధర్, సామాజిక సాహిత్య సేవకులు గోళ్ళ నారాయణరావు, అమరా వతి ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహా ఏర్పాటునకు శంకుస్థాపన

విశాలాంధ్ర - గుడివాడ : భారతీయులందరికీ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దైవ సమా నుడని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శని వారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ శంకు స్థాపన కార్యక్రమాన్ని అంబేద్కర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బౌద్ధ గురు వులు బౌద్ధ సంప్రదాయం ప్రకారం విగ్ర హానికి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు గుడి వాడ పట్టణంలో ప్రధానమైన నెహ్రూ చౌక్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమన్నారు. సెప్టెంబర్ 10వ తేదీ కల్లా కాంస్య విగ్రహం గుడి వాడ వస్తుందన్నారు. సెప్టెంబర్ 30 తేదీన విగ్రహ ఆవిష్కరణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి కాకొల్లు భస్మా కరరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ సిబ రాజేష్, నాయకులు, అంబేద్కర్ అభిమాన సంఘాల నాయకులు, బౌద్ధ బృందం, పాల్గొన్నారు.

ఒరిజినల్ పట్టా డాక్యుమెంట్స్ పోయినవి

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ నివాసి డోర్.నెం. 66-3-15/1, ఠాగూర్ లైబ్ ఇనిస్టిట్యూట్ రోడ్డు, ఎన్‌టిఆర్ సర్కిల్, పటమట, నాకు సంబంధించిన నందమూరు గ్రామం, ఉంగుటూరు మండలం, వాస్తవ్యులైన **(1) మల్లవల్లి గోపయ్య, 3 సెంట్లు (2) మల్లవల్లి వెంకటేశ్వరరావు, తండ్రి గోపయ్య 3 సెంట్లు** వారికి సంబంధించిన మొత్తం కలిపి **6 సెంట్లు**గా ఉన్న ఒరిజినల్ పట్టా కాగితములు **ది. 05-08-2005** నాడు సర్వేచేయు నిమిత్తమై విజయవాడ నుండి నందమూరుకు సర్వే చేయుటకు గుడివాడ వెళ్లు బస్సులో వెళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పోయినది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు గానీ, లేదా ఈ క్రింది సెల్ నెంబరు **9490337452** **(మల్లవల్లి వెంకట్రావు)**కు తెలుపగలరు.

ఘనంగా శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : కృష్ణజ న్మాష్టమి వేడుకలను యాదవ సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్డులోని కృష్ణ మం దిరంలో నుండి పట్టణంలోని ప్రధాన రాహదా రులలో కృష్ణుడి ఫోటోలతో వాహనలపై భారీ ఊరింగింపు నిర్వ హించారు. ఈ కార్యక్ర మంలో మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్, వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి జిల్లా నాయకులు మేరుగు మాల కాళీ, యాదవ సంఘం నాయకులు డొక్కు రామచంద్రరావు(రాంబాబు) నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, **JAGARLAMUDI SUNEETHA (Old name)** Wife of **JAGARLAMUDI RAVI SANKAR**, Aged about 45 years. Resident of 501, Bankars Pride, Tadigadapa, Vijayawada-521 137; I have changed my name as **JETTI SUNEETHA, (New name)** Wife of **JAGARLAMUDI RAVI SANKAR**, Hereafter my name is known as **JETTI SUNEETHA, (New name)** Wife of **JAGARLAMUDI RAVI SANKAR**.

ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసు పాత్ర కీలకం

విశాలాంధ్ర బ్యూరో - మచిలీపట్నం : స్థానిక ఇంగ్లీషు పాలెంలో 2025 కానిస్టేబుల్ ఎంపికలో చాలెంజ్

కోచింగ్ సెంటర్ నుండి ఎంపికైన ఆరుగురు కానిస్టేబుల్స్‌ను శనివారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మరియు కూనపురెడ్డి శ్రీనివాసులు సన్మానించారు. ఈ సందర్భంగా లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ 24 గంటలు ప్రజల ప్రాణాలను కాపాడుతున్న పోలీసులు తమ జీవితాలను సమాజ పరిరక్షణ కోసం కేటా యిస్తున్నారని, అటువంటి పోలీస్ వ్యవ స్థలో మన మచిలీపట్నం నుండి పట్టభద్రులైన ఆరుగురు యువకులు కానిస్టేబుల్స్‌గా ఎన్నిక కావడం గర్వకారణం అన్నారు. బందరులో చాలెంజ్ కోచింగ్ సెంటర్ అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు వివిధ ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వడం, అందులో ఒకేసారి ఆరుగురు కానిస్టేబుల్స్‌గా ఎన్నిక కావడం, గతంలో రాష్ట్ర స్థాయిలో ఎస్ఐ ఫస్ట్ ర్యాంకు విశ్వనాథపల్లి ప్రజ్ఞకి రావడం మచిలీపట్నంకు గర్వకారణమన్నారు. ఛాలెంజ్ కోచింగ్ సెం టర్ చైర్మన్ విశ్వంశెట్టి భాస్కర్ మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన అధ్యాపకుల ఆధ్వ ర్యంలో మంచి ఉద్దేశ్యంతో పెట్టిన ఈ కోచింగ్ సెంటర్ నుండి గరికముక్కు అశ్విని (మచిలీపట్నం), టి. నవీన్ కుమార్ (బందరు కోట), కాగిత శివ నాగరాజు (బందరుకోట), పి. నాగ సుబ్రహ్మణ్యం (మచిలీపట్నం), వరి కూటి శేషుబాబు (అవనిగడ్డ), సాత్విక్ (చల్ల పల్లి) ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యఅతిథి కూనపురెడ్డి శ్రీని వాస్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఉద్యోగ ధర్మంతో పాటు సేవా భావాన్ని అలవరచుకోవాలని, విద్యార్థులు ఉద్యోగాలు సాధించేవరకు కృషి చేయాలని అన్నారు.

మహారాజశ్రీ మూడవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) విజయవాడ

O.S. No. 1613/2022

Between

Dhilli మోహన్ సుందరం .... Plaintiff

మరియు

D1 పంకదారు హరికృష్ణ, తండ్రి సుభాష్‌చంద్రబోస్ H.No.74-32-1, పప్పులమిల్లు రోడ్డు, కృష్ణా గోదావరి అపార్ట్‌మెంట్, ధనేకుల కళ్యాణమండపం ఎదురు, కానూరు, కృష్ణాజిల్లా - D1

D2 షేక్ అషిఖ్, తండ్రి షేక్ పీర్‌సాహెబ్, డోర్.నెం. 74-24-24/1, ధనేకుల వారి వీధి, అశోక్‌నగర్, పటమట, విజయవాడ - D2

పై తెలిపిన దావాలోని ప్రతివాదులైన **D1 & D2** అయిన మీకు కోర్టు నుండి ఎన్నిపర్యాయాలు నోటీసు పంపిననూ తీసుకొనుట లేదు గనుక మీ హాజరు నిమిత్తము తేది : **22-08-2025** ఉదయం **10.30** ని॥ వాయిదా వేసినారు. ఆ తేదీన మీరు వ్యక్తిగతంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరు అవ్వవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్మానించెదరు.

వాయిదా తేది : 22-08-2025

సమయం : గం. 10.30 నిమిషాలకు

// బై కోర్టు ఆర్డర్//

కె. సత్యసాయి కుమార్, అడ్వకేట్, బి.సాయిదత్తా టవర్స్, శేషాద్రిశాస్త్రి స్ట్రీట్, గవర్నర్‌పేట, విజయవాడ

సెల్ : 9849306635

మహారాజశ్రీ మూడవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) విజయవాడ

O.S. No. 1613/2022 I.A.No. 652/2022

Between

Dhilli మోహన్ సుందరం .... Plaintiff

మరియు

R1 పంకదారు హరికృష్ణ, తండ్రి సుభాష్‌చంద్రబోస్ H.No.74-32-1, పప్పులమిల్లు రోడ్డు, కృష్ణా గోదావరి అపార్ట్‌మెంట్, ధనేకుల కళ్యాణమండపం ఎదురు, కానూరు, కృష్ణాజిల్లా - R1

R2 షేక్ అషిఖ్, తండ్రి షేక్ పీర్‌సాహెబ్, డోర్.నెం. 74-24-24/1, ధనేకుల వారి వీధి, అశోక్‌నగర్, పటమట, విజయవాడ - R2

పై తెలిపిన దావాలోని ప్రతివాదులైన **R1 & R2** అయిన మీకు కోర్టు నుండి ఎన్నిపర్యాయాలు నోటీసు పంపిననూ తీసుకొనుట లేదు గనుక మీ హాజరు నిమిత్తము తేది : **22-08-2025** ఉదయం **10.30** ని॥ వాయిదా వేసినారు. ఆ తేదీన మీరు వ్యక్తిగతంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరు అవ్వవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్మానించెదరు.

వాయిదా తేది : 22-08-2025

సమయం : గం. 10.30 నిమిషాలకు

// బై కోర్టు ఆర్డర్//

కె. సత్యసాయి కుమార్, అడ్వకేట్, బి.సాయిదత్తా టవర్స్, శేషాద్రిశాస్త్రి స్ట్రీట్, గవర్నర్‌పేట, విజయవాడ

సెల్ : 9849306635

విశాలాంధ్ర

ఆదివారం 17 ఆగస్టు । 2025

బ్రహ్మదేశం వసంత్‌కుమార్‌కు సత్కారం

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్): డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన చేస్తున్న సేవలను అభినందించారు. విజయవాడ వినియోగదారుల కమీషన్ కోర్టు జడ్జీ నేలపూడి చిరంజీవి, సభ్యులు వెంకట రమణ, పూర్వపు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్, విష్ణువర్ధన్, సాయి కృష్ణ, కమర్షియల్ కోర్టు జీపీ. పూర్ణ, పూర్వపు పీఓసీయస్ కోర్టు పీపీ నారాయణ రెడ్డి, న్యాయవాది చిన్నం రామకృష్ణ, ఇతర న్యాయవాదులు హాజరై గాంధీ, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేల పూడి చిరంజీవి మాట్లాడుతూ తన సోసైటీ ద్వారా దేవినగర్ నుంచి మంగ ళగిరి ఎయిమ్స్ వరకు ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయ మన్నారు. వృద్ధులకు అన్నదానం, తదితర సేవలను ఆయన అభినందించారు.

మలబార్ గోల్డ్‌లో 'వ్యాన్' ఆవిష్కరణ

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట : బాధ్యతా యుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా పేరు గాంచిన, ప్రపంచంలోని ప్రముఖ ఆభరణాల రిటైలర్లలో ఒకటైన మలబార్ గోల్డ్ డైమండ్స్, ప్రతి మహిళ తన ప్రత్యే కతను చాటుకుంటూ, వేడుక చేసుకునే అద్భుతమైన సరికొత్త రత్నాభరణాల సేకరణ అయిన 'వ్యాన'ను సగర్వంగా ఆవిష్కరించింది. ఈ సందర్భంగా షోరూం మార్కెటింగ్ మేనేజర్ ఖాసిం మాట్లాడుతూ వజ్రంతో ప్రేరేపి తమైన తేజస్సును, వర్ణరం జితమైన శక్తివంతమైన రత్నాలను, 18, 22 క్యారట్ల బంగారంతో ఎంతో శ్రద్ధగా 'వ్యాన'ను సుందరంగా రూపొందించారని తెలిపారు. ట్రెండీగా, బోల్డ్ సులభంగా ధరించగలిగే ఫ్లూయిడ్, తేలికైన సిల్హౌట్లు ఈ సేకరణలో ఉన్నాయ న్నారు. అంతర్గతంగా దాగియున్న శక్తికి ఒక ప్రశంసగా, తనదైన ప్రత్యేక మార్గంలో ప్రకాశిస్తూ సంప్రదాయాన్ని గౌరవించే స్త్రీ యొక్క గొప్పతనానికి 'వ్యాన' నిదర్శనంగా నిలబడుతుందన్నారు. జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్లో సొగసైన 'వ్యాన' కలెక్షన్తో పాటు, అద్భుతమైన రత్నాలు మరియు అన్కట్ వజ్రాలతో కూడిన సాంప్రదాయ ఆభర ణాల సేకరణను మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రదర్శిస్తుం దన్నారు.

ఈ ఫెస్టివల్లో భాగంగా, వినియోగ దారులు అన్ని రకాల రత్నాలు అస్కట్ వజ్రాల ఆభరణాల తరుగు ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపును పొందవచ్చన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 7, 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటూ నియమనిబంధనలు వర్తిస్తా యన్నారు. 'జస్ట్ లైక్ మీ' అనే ఆకర్షణీయమైన ప్రచారం ద్వారా ఈ 'వ్యాన' ఆవిష్కరణ విస్తరించబడిందన్నారు. దీనిలో మలబార్ గోల్డ్ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్ శ్రీనిధిశెట్టి ఉన్నారన్నారు. మహిళలు తమ నిజమైన స్వభా వాన్ని చక్కదనం, విశ్వాసంతో స్వీకరించడానికి ఇది సాధికారత కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కల్వర్మ, ఎస్.సునయన, ఎన్.ప్రియ, షేక్ రాజీ మలబార్ డైమండ్స్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరనీయుడు సర్దార్ గౌతులచ్చన్న
ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విశాలాంధ్ర - గుడివాడ : బడుగు, బలహీనవర్గల అభ్యు న్నతి కోసం నిరంతరం పోరా టం చేసిన మహాయోధుడు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న నేటి యువతకు ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక పాత సంతాబజార్ వద్ద గల గౌతు లచ్చన్న విగ్రహం వద్ద అయన 116 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముడా చైర్మన్ మాట్టాప్రసాద్‌తో కలసి మాట్లాడుతూ ఇచ్చాపురం నుండి మద్రాసు వరకు దున్నే వాడికే భూమి ఇవ్వాలని కోరుతూ పాదయాత్ర చేసిన మహోన్నత వ్యక్తి లచ్చన్నన్నారు. భావితరాల వారు గుర్తు పెట్టుకోవలసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. అయన బిసిల రిజర్వేషన్ బిల్లు కోసం అనేక పోరాటలు చేసి పదవులు అశించకుండా బి.సిల అభ్యున్నతి కోసం నిలిచిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ, యార్లగడ్డ సుధరాణి మరీదు రోహిణి, దేవరపల్లి కోటి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులుగా కేశినేని, సానా

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ శనివారం తాడేపలి లోని విజయవాడక్లబ్‌లో జరి గింది. ఈ సమావేశంలో 2025-2028కి సంబం ధించి ఏసీఏ నూతన కమిటీ ఎన్నికైంది. అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధికార ప్రతినిధి మ్యాన్ చో ఫేరారే గౌరవ అధ్యక్షుడుగా ఏసీఏ జనరల్ బాడీ మీటింగ్ కి వ్యవహరించారు. ఈ సమావేశంలో ఏసీఏ మాజీ జాయింట్ సెక్రటరీ, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కూడా పాల్గొన్నారు. ఎలాంటి పోటీ లేకుండా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఏసీఏ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే సెక్రటరీగా రాజ్యసభ ఎంపీ సానా సతీస్ బాబు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ గా బి. విజయ్ కుమార్, కౌన్సిలర్ గా దండు గౌర్ విష్ణు తేజ్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ పలు హెూదాల్లో ఎన్నికైన సభ్యులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. వైస్ ప్రెసిడెంట్ పదవి కి బండారు నరసింహారావు ఒక్కరే నామినేషన్ వేయగా, అధికార ధ్రువీకరణ పత్రాలు వివరాలు సరిగ్గా లేక పోవటం వల్ల నామినేషన్ తిరస్కరణకు గురైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ తెలిపారు. అలాగే ఆ పదవికి త్వరగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచింగా, వచ్చే నెల నిర్వహిస్తామని సెక్రటరీ సానా సతీష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లా క్రికెట్ సంఘాల సభ్యులు, అథరైజ్డ్ క్లబ్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానంతరం నూతన కార్యవర్గం పత్రికసమావేశంలో పాల్గొని ఏసీఏ కార్యాచరణ వివరాలు వెల్లడించారు .

రూ.3 లక్షలతో పిహెచ్‌సిలో సౌకర్యాల కల్పన

విశాలాంధ్ర - కృత్తివెన్ను : లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు లక్షల రూపా యలతో ఏర్పాటు చేసిన సౌకర్యా లను ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్ ప్రారంభించారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మూడు లక్షల రూపాయల మండల పరిషత్తు నిధులతో ఏర్పాటు చేసిన ఆద నపు గదులను ప్రారంభించారు. మండల పరిషత్ నిధులను కేటాయించి రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, వైద్యాధికారి సంతోష్ కుమార్, కాంట్రాక్టర్ పులగం నరసింహారావు, కూనసాని శ్రీనివాసు, గోపిశెట్టి వీరస్వామి, పులగం శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నలుగురికి ఉత్తమ ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర - కూచిపూడి : ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లో ఉత్తమ తహశీల్దారుగా మొవ్వ మండల తహ శీల్దార్ మస్తాన్ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా మచిలీపట్నంలో ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ నుంచి ప్రశంసా పత్రం పొందారు. అలాగే ఉత్తమ విఆర్వోగా కూచిపూడి వీఆర్వో ఖాసిం కూడా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ నుంచి ప్రశంస పత్రం పొందారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎస్పీ గంగాధరరావు పాల్గొ న్నారు. ఉత్తమప్రశంసాపత్రాలు పొందినఒకేషనల్ అధ్యాపకులులిమొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్యాకోర్సుఅధ్యాపకులై అప్పి కట్ల వాసుబాబు, చలమలశెట్టి ఆనంద్ లక్ష్మీనారాయణ ఉత్తమ అధ్యాపకులు గా ప్రశంసాపత్రాలనుమంత్రికొల్లు రవీంద్ర చేతుల మీదగా తీసుకున్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

- విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ కోన శశిధర్

విశాలాంధ్ర - విజయవాడ : విద్యార్థి దశలో కొన్నిటికి త్యాగాలు చేసి చదువు పైనే పూర్తి సమయాన్ని కేటాయిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరటం సాధ్యమవుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సూచించారు. విజయవాడలోని శారద విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ శనివారం ఏ ఫ్లస్ కన్వెన్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శారద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిది ;గా హాజరైన కోన శశిధర్ మాట్లాడుతూ శారద విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్య మనందరి లక్ష్యం కావాలి అనే మాట కాలేజీ బ్యానర్ పై చూడ గానే తనకు ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. నేటి సమాజంలో పిల్లలకు కావలసిన సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యాదలు, సహాయ సహకారాలు, సేవా దృక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానంలో ఉండాలి, సమాజం, కుటుంబం పట్ల కలిగి ఉండే బాధ్యతలను, మానవతా విలువలను నేర్పించే కేంద్రాలు కేవలం విద్యాసంస్థలే అని ఆయన వివరించారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు, కళాశాల యండీ వై శారదాదేవి, అడ్వైజర్ ఈఎస్ఆర్‌కె ప్రసాద్‌లతో పాటు వివిధ విభాగాల చెందిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శారద విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే సందడి

విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడ, మొగల్రాజపురంలో ఉన్న శారద విద్యా సంస్థల" ఫ్రెషర్స్ " సెలబ్రేషన్స్ శనివారం ఏ ఫ్లస్ కన్వెన్షన్ హాల్లో ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సభకు ముఖ్య అతిథిగా కోన శశిధర్ (సెక్ర టరీ టు ఏ.పి గవర్నమెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ హయర్ఎడ్యుకేషన్ ఐ.టి,ఈఅండ్సి) డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు గౌరవ అతి థులుగా విచ్చేశారు. సభా ధ్యక్షులు కళాశాల చైర్మన్, డాక్టర్ వై రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి సంవ త్సరం తమ కళాశాల విద్యార్థులకు విశిష్ట వ్యక్తు లను పరిచయం చేసి అమూ ల్యమైన సందేశా లతో విలువైన సమాచా రాన్ని అం దిస్తూ ప్రెషర్స్ డే సెలబ్రేషన్స్" ఎంతో ఘనం గా జరుపుకుంటామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోన శశిధర్ మాట్లాడుతూ "శారద విద్యా సంస్థలు విలువలతో కూడిన విద్య మన అందరి లక్ష్యం కావాలి అనే మాట కాలేజి బ్యానర్పై చూడ గానే తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. నేటి సమాజంలో పిల్లలకు కావలసిన సత్ప్రవర్తన, క్రమ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యా దలు, సహాయసహకారాలు, సేవాదృక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానం లో ఉండాలన్నారు. గౌరవ అతిథి డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు మాట్లాడుతూ విద్యా ర్థులు తమకు అందుబాటులో ఉన్న విద్యా వనరులను ఉపయో గించుకుని, బంగారు భవిష్యత్తుకు మంచి ప్రణాళిక వేసుకున్నారు. విద్యార్థులు టెక్నాలజీని పరిమిత అవసరాలకు మాత్రమే వినియోగిస్తూ, మంచి విద్యార్థిగా రాణించాలని అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదాదేవి మాట్లాడుతూ తమ కళా శాలలు స్థాపించి అప్పుడే 11 వసంతాలు గడిచి పోయాయని, ఈ వసంతకాలంలో తాము ఎంతో మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల వ్యక్తిగత అభి వృద్ధికి వెన్నుతట్టి ప్రోత్సాహిస్తున్నామని కళాశాల అడ్వైజర్ ఈ.యస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థులు సాధించిన జెఇఇ మెయిన్స్ నీట్ ప్రవేశ పరీక్షల ఫలితాలు, వారు పొందిన మెడికల్ అండ్ ఇంజనీరింగ్ సీట్ల వివరాలతో గడచిన 11 వసంతాల అనుభవాలతో మరెన్నో వసంతాలతో కళాశాల అభివృద్ధికి మరింత తమ వంతు కృషి చేస్తామని కళాశాల జి.యమ్. జి.వి. రావు తమ కళాశాల వార్షిక నివేదికను సమర్పించారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎవరైతే ధర్మాన్ని అనుసరిస్తారో వారు నిజంగా శ్రీకృష్ణ పరమాత్ముని అనుగ్రహాన్ని పొందుతారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తాడేపల్లి శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొని శ్రీకృష్ణ పరమాత్ముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా తాడేపల్లి కృష్ణుని గుడిలో దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 6000 మందికి అన్నదానం నిర్వహించారు. అంతకముందు ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, వస్త్రాలంకరణ, వివిధ రకాల పుష్పాలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. సాయంత్రం ఉట్టి కొట్టె కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ్ సంఘం అధ్యక్షులు లాకా వెంగలరావు, దానబోయిన సుందరరావు యాదవ్, ఏపీ టూరిజం డిపార్ట్మెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ, అసెంబ్లీ చీఫ్ కమర్షియల్ గణేష్, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ట్రస్ట్ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, తాళ్ల వెంకటేష్, మంగళగిరి మండల రూరల్ పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, పార్థసారథి, చావలి ఉల్లయ్య, గాదె పిచ్చిరెడ్డి, సింకా గంగాధర్, తాడిబోయిన నాగేశ్వరరావు, సూర్యనారాయణ, తాడిబోయిన భాస్కర్, తాడిబోయిన గోపి, కె.నాగేశ్వరరావు, గణేష్, వైసీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి : శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా మహానాడులో శ్రీకృష్ణ సీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు చిన్నపోతుల చిన్నా, అన్నెం కుసుమ, శ్రీకృష్ణ సీతారామ సేవా సమితి సభ్యులు సంక్రాంతి అశోక్, జట్టిపోయిన వెంకటేశ్వర్లు, గిద్దా నారాయణ, వేల్పుల నారాయణ, వేల్పుల ఆంజనేయులు, సంక్రాంతి వెంకటపతి, రామయ్య, ఆలా ప్రకాష్, మర్రి నటమరాజు, కనకరావు, తిరుపతయ్య, చిన్నయ్య, రాజయ్య, కొండయ్య, కిరణ్, అనిల్, రాజు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, గురువయ్య, నారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లి : శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా పెనుమాకలో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కళ్ళం రాజశేఖర్ రెడ్డి, దాసరి కృష్ణ, కొల్లి శేషు, గాదె శ్రీనివాసరావు, జానీ, మల్లిశెట్టి పిచ్చియ్య, నాగరాజు, కడియం కళ్యాణ్, కూనపరెడ్డి రమేష్, బొబ్బా రవి తేజ, దాసరి బాబు, తాడిబోయిన తిరుపతియ్య, కమిటీ సభ్యులు కొరివి రంగబాబు, గువ్వా గోపి రాజు, కడియం నాగరాజు, తాడిబోయిన సురేష్, కడియం శ్రీనివాసరావు, చప్పిడి శివ, నాగరాజు, గోపి, శివరామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

దుగ్గిరాల : శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాలయం సెంటర్లోని శ్రీకృష్ణ సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. సందర్భంగా కేకులు కట్ చేశారు. అదేవిధంగా యాదవబజార్,రైలు పేటలో ఉన్న శ్రీ కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామంలోని మహిళలు,భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రైలు పేటలో ఉన్న మందిరం వద్ద 3 వేల మందికి అన్నసంతర్పణ జరిపారు. నాయకులు, మహిళలు,పెద్దలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుంటూరు సిటీ: స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని సుమేధ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో స్కూల్ విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కృష్ణాష్టమి పర్వదినానికి సంబంధించిన గీతాలను విద్యార్థిని విద్యార్థులు భక్తి శ్రద్ధలతో ఆలపించారు.. కృష్ణ భక్తి గీతాలకు నృత్యాలు చేసి వేడుకకు విచ్చేసిన ఉపాధ్యాయులను , తల్లిదండ్రులను అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే వేడుకను జరిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగ జరుపుకోవడానికి గల కారణాలను కృష్ణాష్టమి యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ఈ నెల 17, 18 తేదీలలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలలో మున్సిపల్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. స్థానిక అరండల్పేట శానిటరీ డివిజన్ వద్ద కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి సీపీఐ కార్యాలయం వరకు ప్రజాప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రజాప్రదర్శన, బహిరంగ సభలో మున్సిపల్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

విశాలాంధ్ర-పెదకాకాని : భారతీయ రాజకీయవేత్త, భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి. స్వతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం సెంటర్లో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మంగళగిరి : స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు బాంధవుడు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ లచ్చన్న చిన్న వయసులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, క్విట్ ఇండియా ఉద్యమానికి దక్షిణ భారతదేశం నుంచి నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా సేవలందించారని, ఆలయ ప్రవేశం, అంటరానితనం నిర్మూలన, జై ఆంధ్ర ఉద్యమాలకు పునాది వేసిన మహానాయకుడని కొనియాడారు. ప్రభుత్వం లచ్చన్న జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి : భారతదేశంలో వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి సర్దార్ గౌతు లచ్చనని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక రామలింగేశ్వరపేటలోని బిసి సంఘం కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. జొన్నాదుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో, ఉప్పు సత్యాగ్రహంలో, విదేశీ వస్త్ర బహిష్కరణలో గౌతు లచ్చన్న పాల్గొన్నారని చెప్పారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న సమయంలో 40 రోజుల పాటు జైలు జీవితం గడిపారన్నారు. స్వాతంత్ర్యం సాధించేంత వరకు వివాహం చేసుకోనని శపథం చేసి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 37వ ఏట లచ్చన్న వివాహం చేసుకున్నారని వివరించారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్యోద్యమ నాయకునిగా, శాసన సభ్యునిగా, మంత్రిగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో బిసి నాయకులు జొన్నాదుల శివరామకృష్ణ, వంగర సత్యన్నారాయణ, కటికం అచ్చయ్య, రమేష్, మురళి, ములికి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్లో శనివారం పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు పల్లపోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, రాష్ట్ర కృష్ణబలిజ సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, సీనియర్ నాయకులు రేఖ సుధాకర్ గౌడ్, గోవాడ దుర్గారావు, జొన్నాదుల బాలకృష్ణ, మన్యం రమేష్ బాబు, చాగంటి పూర్ణచంద్రరావు, బైరబోయిన శ్రీనివాస్, చావలి పుల్లయ్య, తాత కోటయ్య, పండేటి తిరుపతయ్య, తోట పిచ్చయ్య, కొక్కిరపాటి పూర్ణ, కంచర్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మలబార్లో సరికొత్త రత్నాభరణాల 'వ్యాన' ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ షోరూంలో సరికొత్త రత్నాభరణాలతో కూడిన 'వ్యాన' ఎగ్జిబిషన్ను మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో భాగంగా శనివారం స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన సరికొత్త రత్నాభరణాలతో కూడిన 'వ్యాన' ఎగ్జిబిషన్ను మిసెస్ గార్జియస్ ఇండియా ప్లస్-2025 టైటిల్ విన్నర్ కొలిశెట్టి నీలిమ, ప్రియ ఇందన, హర్షిత, సాహితీ రెడ్డి, శివాని, రమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శన సెప్టెంబర్ 7వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 'వ్యాన' కలెక్షన్లతో పాటు అద్భుతమైన రత్నాలు..అన్కట్ డైమండ్స్తో కూడిన సాంప్రదాయ ఆభరణాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 'వ్యాన' అనేది కేవలం ఆభరణాల సేకరణ మాత్రమే కాదని, అన్ని రకాల రత్నాలు, అన్కట్ వజ్రాభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గుంటూరు నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఆభరణాల వ్యాపారానికి అతీతంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సమాజాభివృద్ధిపై ప్రభావం చూపించడంలో లోతుగా దృష్టి సారించి విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆకలి నిర్మూలన వంటి సీఎస్ఆర్ కార్యక్రమాలకు తాము ఆర్జించిన లాభాలలో 5 శాతాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెలరీ అసిస్టెంట్ స్టోర్ హెడ్ జితిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

విశాలాంధ్ర-దుర్గి : మండ లంలోని దుర్గి, జంగమహేశ్వ రపాడు, ఓబులేశునిపల్లె గ్రామంలో శనివారం యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణా ష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జంగమహేశ్వ ర టపాడు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణుని మందిరం, దుర్గిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీకృష్ణుని విగ్రహం, ఓబులేశునిపల్లె గ్రామంలో శ్రీకృష్ణుని ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వైభవంగా ఉట్టి కొట్టే కార్యక్రమం, పూజా కార్యక్రమం అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ధరించిన చిన్ని క్రిష్ణుని వేషధారణ ఆకర్షణగా నిలిచింది.

దాచేపల్లి : శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం మండ లం అంతటా ఘనంగా ప్రారంభమయ్యాయి. సారంగపల్లి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో తహశీల్దార్ గోగసాని శ్రీనివాస యాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కేసానపల్లి రోడ్డులో వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అదేవిధంగా తంగెడ, రామాపురం, గామాలపాడు, తక్కెళ్ళపాడు, కేసానపల్లిలో వేడుకలు చేశారు. అదేవిధంగా నారాయణపురంలోని కోదండ రామాలయంలో ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు.

వినుకొండ : స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నందు కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారికి శ్రీకృష్ణ చందన అలంకరణతో కొలువు తీరాడు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసుల శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవపేతంగా కనుల పండగగా ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య సెక్రెటరీ, అచ్యుత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ శ్రీకాళ్ల రామ కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అన్న వీరబ్రహ్మా, జీవి మాధవరావు, కొత్త మాస పెదరాములు, ఏల్చూరి వెంకటనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వినుకొండ : వినుకొండ గీతాంజలి రెసిడెన్షియల్ క్యాంపస్ నందు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మతి కృష్ణవేణి మాట్లాడుతూ. ముందుగా అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆవేశం కాదు ఆలోచన, సంయమనము కావాలనే విషయాన్ని కృష్ణుని జీవితం నుంచి నేర్చుకోవాలన్నారు. ఆయన అందరికి జగద్గురువు అయ్యాడన్నారు. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమం అందర్నీ అలరించింది.

అమరావతి : శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన అమరావతిలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవాలయ ప్రాంగణాల్లో ఉట్టి కార్యక్రమాలను ఏర్పాటు చేసి యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉట్టి కొట్టె కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రెంటచింతల : మండలం లోని పలు గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆరోగ్యపురం కాలనీలో వేంచేసిన కృష్ణుడు ఆలయంలో ఉదయం శ్రీ కృష్ణుడు వేషధారణలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో ఆలయం చైర్మన్ కట్టెబోయిన సైదులు, బీజేపీ నాయకులు ఇగుటూరి రాజశేఖరరెడ్డి, ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పల్చూరి ప్రసాదరావు, గొంటు ఆదిరెడ్డి, పల్చూరి సుబ్బారావు, బోడపాటి రామకృష్ణ విజేతలకు బహుమతులను అందచేశారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు రూ.44,45,104 సీఎం సహాయనిధి చెక్కులను శనివారం రాత్రి జీవీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో అండగా నిలుస్తుందన్నారు. పార్టీలక తీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడకూడదని ఉద్దేశం తోనే సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధులు మంజూరు చేయించిన జీవీ ఆంజనేయులుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి వర్ధంతి

విశాలాంధ్ర - వినుకొండ : మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి వేడుకలు వినుకొండలోని బీజేపీ కార్యాలయంలో జరిగాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు, వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. వాజపేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన పరిపాలనా దక్షత, సుపరిపాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. వాజపేయి గొప్ప రాజనీతిజ్ఞుడు, అద్భుతమైన వక్త, కవి అని పేర్కొన్నారు. పోఖ్రాన్ అణు పరీక్షలతో ప్రపంచానికి భారతదేశ సత్తా ఏంటో చాటిచెప్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయుకులు తవ్వా నాగేశ్వరరావు, గోళ్ల మస్తాన్ రావు, బండి వెంకటేశ్వర్లు, మూర్తియ్య, జోరేగే శ్రీనివాసరావు, పసుమర్తి శంకరరావు, గాలెమ్మ, రత్నాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గత ఏప్రిల్ నెలలో జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడిని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ సిహెచ్ మణికృష్ణ మాట్లాడుతూ గత ఏప్రిల్ 23న మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల నామాల మీనా ఇంటిలో బంగారం, నగదు, బైక్ దొంగిలించబడింది. ఆ ఇంట్లో రూ.1.97 లక్షలు విలువ చేసే బంగారం, రూ.2 లక్షలు నగదు, రూ.1.80 లక్షలు విలువ చేసే బైక్ మొత్తం రూ.13.05 లక్షలు చోరీ జరిగిందని అన్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఆ ఇంట్లో చోరీ పాల్పడిన వ్యక్తి గాలం రాజేష్ అని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు రాజేష్‌ను పట్టుకున్నామని చెప్పారు. నిందితుడి నుంచి చోరీ చేసిన సొమ్మును రికవరీ చేసి ముద్దాయిని కోర్టులో హాజరుపరుచుతామని అన్నారు. చోరీ కేసును త్వరగా ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ మణి కృష్ణ, పోలీస్ సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-నూజెండ్ల : 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నూజెండ్ల మండలం సీతా రామపురం గ్రామంలో ఉన్న ఎస్‌వీఎస్‌సీ హైస్కూల్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు 1991-96 బ్యాచ్ వారు 2024-25 సంవత్సరంలో పదవ తరగతిలో ప్రథమ(546), ద్వితీయ(529), తృతీయ(520) స్థానంలో నిలిచిన విద్యార్థినులు ధూపాటి శ్రావణి, అందుగులపాటి నందిని, దూదేకుల నసీనలకు రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున ప్రైజ్ మని అందచేశారు. ప్రధానోపాధ్యాయులు శిష్టా కామేశ్వరరావు శర్మ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సహకారం ఎంతో ఉపయోగకరమని పూర్వవిద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రేవిళ్ళ శ్రీనివాసరావు, అన్నెం శ్రీనివాసరెడ్డి, గురులింగయ్య, గిరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక రైలుపేట 1వ లైన్ నందు నూతన సిమెంట్ రోడ్డును ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ రోడ్డు నిర్మాణం వల్ల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. సుపరిపాలన ప్రారంభ సమయంలో ఈ వార్డుకు వచ్చానని, అప్పుడు ప్రజలు రోడ్డు అధ్వానంగా ఉందని తన దృష్టికి తేగా తక్షణం సిమెంట్ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించానని, చెప్పిన 20 రోజుల్లోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని, అది సుపరిపాలన అని అన్నారు. నేడు ఈ రోడ్డు ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళాశాల విద్యాభివృద్ధి కమిటీ సమావేశం

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీకి అనుబంధమైన మహాత్మాగాంధీ విద్యాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి కమిటీ అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు తెలనాకుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఇందులో ప్రధానంగా కళాశాల ప్రిన్సిపాల్ టీజే చంద్రశేఖర్ బాబు, సీనియర్ అధ్యాపకుడు బొబ్బిలి వెంకటేశ్వర్లు వినతి మేరకు పలు అంశాలపై చర్చించారు. అందులో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్నం పూట భోజనంలోకి మజ్జిగ ఇవ్వాలని, సాయంత్రం పూట నిర్వహించే ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం పెట్టాలని, కళాశాలలో చేరే నిరుపేద విద్యార్థులకు ఫీజు చెల్లించాలని కమిటీ సభ్యులు తీర్మానించినట్లు సీపీఐ నేత తెలనాకుల సత్యనారాయణ వెల్లడించారు. ఈ సమావేశంలో రెండు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు ఝాన్సీ ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక నిర్మల గర్ల్స్ హై స్కూల్ నందు ఉపాధ్యాయురాలు కొండ్రు ఝాన్సీ ఉద్యోగ విరమణ కార్యక్రమం లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో చేసిన సేవలను జీవీ కొనియాడారు. ఆమె ఎంతో మంది విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలిచిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పెదకూరపాడు ఆనందపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ సౌజన్యంతో తెనాలి తాలూకా మంచికలపూడి గ్రామస్తులు కొండపనేని నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు కొండపనేని సాంబశివరావు, సుబ్బారావు, మౌళయ్యలు ఇచ్చిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను వారి కుమారులు కొండపనేని శ్రీనివాసరావు, విజయ్ కృష్ణ, మురళీ కృష్ణలు ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ప్రెసిడెంట్ రోటేరియన్ కొండపనేని విజయ్ కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ వారు ముందుంటుందన్నారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కనకపూడి మరియమ్మ దాతలను సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ విద్యార్థులకు స్వీట్స్, కాపీ బుక్స్, పెన్సిల్స్ తదితరాలతో ఉన్న కిట్‌ను అందజేశారు.

ఏపీయూడబ్ల్యూజే నగర నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా కొంగర వెంకయ్య, కార్తిక్‌రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు నగర మహాసభ శనివారం యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్ మీరా అధ్యక్షతన కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ మీడియా అధ్యక్షులు యేచూరి శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పి.భక్తవత్సలరావు, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు నగర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షులుగా కొంగర వెంకయ్య (విశాలాంధ్ర దినపత్రిక), గౌరవ అధ్యక్షులుగా కె.తిరుపతి రెడ్డి (ఆంధ్రప్రభ దినపత్రిక), కార్యదర్శిగా బి.వై రెడ్డి (కార్తీక్, సిటీ న్యూస్ తెలుగు ఛానల్), ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు (ఈనాడు దినపత్రిక), ఎ.వీరభద్రరావు (సూర్య పత్రిక), సహాయ కార్యదర్శులుగా జి.అప్పారావు(ఆంధ్రప్రభ దినపత్రిక), కొండెపాటి సుజిబాబు(విశాలాంధ్ర దినపత్రిక), రామ్ భాస్కర్(వార్త దినపత్రిక), కోశాధికారిగా షేక్ సుభాని(ఎస్ఆర్‌కె ఛానల్), కార్యవర్గ సభ్యులుగా దూపాటి ప్రకాష్(సాక్షి దినపత్రిక), చెరుకూరి సుబ్బారావు(ఐ న్యూస్), పి.లూర్ధురాజు(బీఆర్‌కె ఛానల్) వహీద్(కాకతీయ దినపత్రిక),రఘునాధ రెడ్డి(భారత్ ప్రతినిధి), పి.కోటేశ్వరరావు (సిటీ న్యూస్ తెలుగు ఛానల్)లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన ఈ కమిటీని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు భక్తవత్సలరావు, పులివర్తి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎన్ మీరా, కె.రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, జిల్లా కమిటీ సభ్యులు పరస్యం నాయక్, రత్నాకర్, రాంప్రసాద్, షరీఫ్, భాష, నగర మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్ కుమార్, ఫణి కుమార్, ఆసిఫ్ జిల్లా, నగర నాయకులు ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వారు యూనియన్ బలోపేతానికి విశేష కృషి చేయాలని కోరారు. జర్నలిస్టులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే స్పందించి వారి సమస్యలు పరిష్కరించే దిశగా పయనం అవ్వాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర నాయకత్వం తలపెట్టిన ఏ కార్యక్రమాన్ని అయినా విజయవంతం చేయాలని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్, గుంటూరులో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆదివారం జరిగే ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలో విజయవంతం చేయాలని, ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

గౌతు లచ్చన్న పోరాటాలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఉద్యమ స్ఫూర్తికి, కార్యదక్షతకు, సాహసానికి ప్రతీక సర్దార్ గౌతు లచ్చన్న అని, అణగారిన వర్గాల తరపున నిలబడి ఆయన చేసిన పోరాటాలు ఎంతో స్ఫూర్తిదాయకమని వేమూరు సనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు, గుంటూరు తూర్పు శాసనసభ్యుడు మొహమ్మద్ నసీర్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు నగర్ కమిషనర్ పులి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ తదితర బిసి, గౌడ సంఘం నాయకులు బస్ స్టాండ్ ఎదురు ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, గుంటూరు అర్బన్ గౌడ సంఘం అధ్యక్షులు గాలి సుబ్బారావు, విగ్రహ కమిటీ సభ్యులు రావుల మణి, చెన్ను శ్రీనివాస్ కుమార్, గౌడ సేవా ట్రస్ట్ అధ్యక్షులు దాసరి వెంకట్రావు, గీత బంధు సేవా ట్రస్ట్ అధ్యక్షులు వీరంకి రంగారావు, గుంటూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తుళ్లూరు శ్రీనివాసరావు, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుక్కల రాంప్రసాద్, బత్తిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్‌లు వద్దు

విశాలాంధ్ర-అమరావతి : క్షవర వృత్తిదారుల జీవనోపాధిని దెబ్బకొట్టే విధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ సెలూన్ వ్యవస్థను తుదముట్టించేందుకు అనాదిగా క్షవర వృత్తులపై ఆధారపడి జీవించే వృత్తిదారులు యావత్తు సమాయత్తం కావాలని అమరావతి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘ వృత్తిదారుల నాయకులు బి.సూరిబాబు, చింతపల్లి శివప్రసాద్, తుళ్లూరు కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన అమరావతి ప్రధాన వీధిలో కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్పొరేట్ రిలయన్స్ కంపెనీ ద్వారా ఏర్పాటు చేస్తున్న సెలూన్ షాపులను మూసివేయాలని, అనాదిగా క్షవర వృత్తిని జీవన విధానం చేసుకొని జీవిస్తున్న కుటుంబాలపై దాడి చేయొద్దని, అమరావతి మండల పరిధిలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం క్షవర వృత్తిదారులు సంయుక్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంప్రదాయ సాంస్కృతిక విధి విధానాలు కొనసాగాలంటే నాయి బ్రాహ్మణుల ప్రముఖ పాత్ర ఉన్న విషయాన్ని సభ్యసమాజం గుర్తెరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు తాళ్లూరు కోటేశ్వరరావు, అమరావతి పట్టణ అధ్యక్షులు చింతలపల్లి శివప్రసాద్, క్షవర వృత్తిదారుల జిల్లా సంఘ నాయకులు బి.సూరిబాబు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు నాదెండ్ల మల్లేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, నినుముక్కల సాంబశివరావు, బి.విశ్వనాధం, పూర్ణ, రాము, తేజ, తాటికొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానమే మహాదానం: గాలిబ్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అన్నదానమే మహాదానమని రిటైర్డ్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ గాలిబ్ అన్నారు. ఏఎన్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉషారాణి కుమారుడు శశాంక్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక నంబూరు యానాది కాలనీలోని యానాది కుటుంబాలకు ఆహార పంపిణీ కార్యక్రమాన్ని స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు (డీకే)ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన గాలిబ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఏ రూపంలో సేవ చేసినా అది గొప్ప కార్యమని, అటువంటి కార్యాన్ని స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు చేయటం అద్భుతమని కొనియాడారు. ఆయన చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు ముందుకు వచ్చిన ప్రజా సేవలో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్స్ వెంకటేశ్వరరావు, వై.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘మా-ఏపీ’ ఎన్నికలకు 86 నామినేషన్లు

విశాలాంధ్ర-తెనాలి : మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా - ఏపీ) సంస్థాగత ఎన్నికలలో వివిధ పదవులకు పోటీ చేసేందుకు 86 అభ్యర్థుల నుంచి నామినేషన్లు వచ్చాయని సంస్థ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ, జూలై 31వ తేదీతో నిర్ణీత గడువు పూర్తికావడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి ఎన్నికలలో పోటీ చేసేందుకు నామినేషన్లు వచ్చాయని చెప్పారు. సభ్యత్వం లేకి కారణంగా 18 నామినేషన్లను పోటీకి అనర్హతగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. ఓ ప్రముఖ నటుడు అధ్యక్షుడుగా నామినేషన్ పంపినప్పటికి ఆంధ్రప్రదేశ్ నివాసి కాకపోవడంతో తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని మాత్రమే నియమించాలని కమిటి నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. కార్యవర్గ సభ్యులుగా ఒక్కో రాష్ట్రం నుండి ఒక్కొక్కరిని ప్యానల్‌లోకి తీసుకుంటామని దిలీప్‌రాజా తెలిపారు. ఎన్నికలను ఏకగ్రీవం చేయడానికి కొందరు సీనియర్ నటీనటులు ప్రయత్నం చేస్తున్నప్పటికీ పోటీ అనివార్యమైతే ఎన్నికలను సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించేందుకు సంబంధిత యంత్రాంగం సిద్ధంగా వున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి : క్రాంతికుమార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విలువలు, విశ్వసనీయతలే ఆభరణాలుగా నిబద్ధత గల రాజకీయాలు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న ఎందరికో స్ఫూర్తి అని ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయసాధనకు కృషి చేద్దామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా గుంటూరు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ కోలా అశోక్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, జిల్లా యువ నాయకులు యేటి కోటేశ్వరరావు, గౌస్, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అవగాహన సంస్థ కార్యాలయంలో ఈ నెల 17ఉదయం 11 గంటలకు ‘ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు’పై ఆరోగ్య సభ జరగనుందని ఆ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.అనూష ప్రధాన వక్తగా పాల్గొని దీర్ఘకాలిక దగ్గు, అలర్జీలు, గొంతు కఫం, ఆయాసం, అలసట, ఛాతినొప్పి, శ్వాసలో గురక, నిమోనియా, సీఓపీడీ, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్ తదితరాల గురించి సమగ్రంగా వివరిస్తారన్నారు. సందేహాలు కూడా నివృత్తి చేస్తారని, ఆరోగ్యాభిలాషులందరూ హాజరై తమ ఆరోగ్య పరిరక్షణను కాపాడుకోవాలని ఆయన కోరారు.

వాజ్ పేయి వర్ధంతి

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల కేంద్రమైన దుగ్గిరాలలో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొంగర జోగేంద్ర ప్రసాద్, పాటిబండ్ల రాజారావు, కొండపనేని రవీంద్ర,, తాడిపోయిన శ్రీధర్, సత్యనారాయణ, సంగమేశ్వర రావు,నాగరాజు పాల్గొన్నారు.

కష్టకాలంలో తక్షణమే స్పందిస్తున్న లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గంలోని ప్రజలు కష్టకాలంలో ఉంటే తక్షణమే స్పందించి మంత్రి నారా లోకేష్ అండగా నిలుస్తున్నారు. తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన మక్కపాటి నగేష్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన కుటుంబ ఆర్థిక ఇబ్బందులను ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి నగేష్ బాబు కుటుంబ పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు నగేష్ బాబు కుటుంబానికి రూ.11 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ నాయకులు లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు శనివారం చెక్కు అందజేశారు. రూ.11 లక్షల విలువైన చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు నగేష్ బాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగేష్ బాబు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆర్థిక సాయం తమ కుటుంబానికి గొప్ప భరోసా అని అభిప్రాయపడ్డారు. అవసరమైన ప్రతిఒక్కరికి సకాలంలో సహాయం అందేలా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మక్కపటి వెంకటకృష్ణ రావు, కొంకా ముసలయ్య, దవులూరి అనిల్, కంచర్ల కోటేశ్వరరావు, పందిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PRABHAKARA PRABHU DURU (Old Name), S/o. DURU VENKATA RATNAM Resident of Door No: 16-1-137, Christianpeta, Nandivelugu Road, Old Guntur, Guntur, Guntur District - 522001, Andhra Pradesh. I have changed my name as DURU PRABHAKAR PRABHU (New Name) S/o. DURU VENKATA RATNAM. Hereafter my name is known as DURU PRABHAKAR PRABHU (New Name) S/o. DURU VENKATA RATNAM.

GENERAL NOTICE

IN THE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ::GUNTUR
E.P.No.86/2024 IN O.S.No.215 / 2006

Between:
Kurivella Bala Sudhakar... Decree-Holder
and
K. Rajeswara Rao & Co., Rep., by its Partner, K. Taraka Murali Krishna & others.
...Judgment-Debtors

To:
K. Taraka Murali Krishna, S/o. Anjaneyulu, R/o.D.No.88-228, Beside Mirchi Yard, Chinna Abbai Hotel Adjacent Road, GT Road, Guntur-522 004.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సమన్లు Substituted Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరువేస్తూ, మీ యొక్క హాజరు నిమిత్తం **ది.28-08-2025**వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజున ఉ॥గ॥**10-30**ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ వకీలుగారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది : **28-08-2025**

MODUKURI SRINIVASA RAO,
Advocate for Petitioner, Sambasivapet, Guntur, Cell No:99853 08414.

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల హర్షం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మహిళలు అభినందనలు తెలిపారు. వారి అభిప్రాయంలో... ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు పెద్ద స్థాయిలో ప్రయోజనం కలుగుతుందని, గృహ ఖర్చులలో కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. మా సమస్యలు అర్థం చేసుకుని ఇంత మంచి పథకం అమలు చేసినందుకు ధన్యవాదాలు అంటూ హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఏపీడీగా మల్లికార్జునరావు

విశాలాంధ్ర-దుర్గి : ఉత్తమ జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహాయ పథక సంచాలకులుగా కొరటా మల్లిఖార్జునరావు ఎంపికయ్యారు. నర్సరావుపేటలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాన్ని మల్లిఖార్జునరావు అందుకున్నారు.

ఉత్తమ గ్రంథాలయాధికారిగా వేణుగోపి

విశాలాంధ్ర-దుర్గి : ఉద్యోగ విధుల్లో అత్యుత్తమ పని తీరు, అంకితభావం కనబర్చిన అధికారి పులిబండ్ల వేణుగోపికి గుర్తింపు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కలెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రంథాలయాధికారిగా వేణుగోపి అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దుర్గి శాఖ గ్రంథాలయాధికారి వేణుగోపి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ అధికారిగా గుర్తించినందుకు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ యువత రక్తదానం

విశాలాంధ్ర-తుళ్ళూరు : మండలంలోని వెంకటపాలెంలో ఎమ్మార్పీఎస్ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ అంజయ్య హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం వంటి సత్కార్యాలతో పాటు సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. రక్తదానం ప్రాణాలను కాపాడే మహోన్నత దానం అని ఆయన అన్నారు. తాడికొండ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ఏసుపాదం, మండల నాయకులు యాకోబు, ఇతర ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమానం

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకానిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-189 టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం వారు ఇండిపెండెన్స్ డే సందర్భంగా పెదకాకాని జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు 2024-25 పదవ తరగతి నందు స్కూల్లో ఫస్ట్, సెకండ్ థర్డ్ విద్యార్థులకు ప్రైజ్ మనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, పీఈటీ లక్ష్మీపతి, గురవయ్య ఉపాధ్యాయులు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. పూర్వ విద్యార్థులు టి.అప్పారావు, రమేష్, రవీంద్ర, టి.ఉషారాణి, సుబ్బారావు, సాంబశివరావు, మరియదాసు, ధనుంజయరావు, సాంబిరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే సీపీఐ ధ్యేయం

- పది గంటల పని విధానం రద్దుకు పోరాటం
- నేటి సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి
- జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మిక హక్కుల పరిరక్షణ మరచి అదనపు పనిభారం పెంచడానికి ప్రయత్నాలు చేయటాన్ని కార్మికవర్గం వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించడానికి సంసిద్ధంగా ఉన్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి తెలిపారు. స్థానిక సంగడిగుంట రేగుల రాఘవయ్య భవన్‌లో శనివారం జరిగిన గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ఎన్డీఏ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ, కర్షక వ్యతిరేక విధానాలపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించేందుకు సీపీఐ గల్లీ నుంచి ఢిల్లీ దాకా నూతన ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి మహాసభలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ మహాసభలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ భవిష్యత్తు సమరశీల పోరాటాల వైపు ప్రజలను నడిపించేందుకు వేదిక కానున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హమాలీ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని గతంలోనే పార్లమెంట్ కమిటీ వేయడం జరిగిందని, ఇప్పటివరకు ఆ కమిటీ సిఫార్సు చేసిన నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేయటానికి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీన సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలు నిర్వహించటం జరుగుతుందని, ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మానంద రెడ్డి స్టేడియం నుంచి ప్రజాప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. నగరంలోని కార్మికవర్గం పెద్దఎత్తున ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, నగర ముఠా కార్మిక సంఘం నాయకులు ఎస్.లక్ష్మయ్య, పప్పుల రోసి రెడ్డి, రమణ, శీను, పొనుగోటి వెంకటరెడ్డి, రేగుల రాఘవ, కొత్త శివారెడ్డి, ఏనుగంటి వెంకట్రావు, ముసలా లక్ష్మయ్య, కొత్త నాని, ఎస్పీ కొండయ్య, సిరిగిరి దుర్గా, అనంతయ్య, సోమిరెడ్డి, అమరలింగం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకానికి విశేష స్పందన: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-రెంటచింతల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడానికి ఆగస్టు 15 ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి విశేష స్పందన లభిస్తున్నట్లు గురజాల మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఆరోగ్యపురం కాలనీలోని కృష్ణుడు ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా నిర్వహించిన కళ్యాణంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఆలయ చైర్మన్ కట్టెబోయిన సైదులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంలో భాగంగా ఒక్కొక్క పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి, రెంటాల మాజీ సర్పంచ్ బొబ్బే సుంకయ్య, టీడీపీ నాయకులు మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ఈ నెల 17, 18 తేదీలలో జరిగే సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియం ఆటో స్టాండ్ వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై విజయ టాకీస్ ప్రాంగణం వరకు జరుగుతుందని, అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు మంగా శ్రీనివాసరావు, జంగాల చైతన్య, సమితి సభ్యులు బాబర్, రాంప్రసాద్, రజాక్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ఈ నెల 17, 18వ తేదీలలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జీజీహెచ్ ఆటో కార్మికుల సమావేశం శనివారం గుంటూరులో జరిగింది. ఈ సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా జిల్లా మహాసభలు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు చర్చించి తీర్మానాలు రూపొందించటం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజల మెరుగైన జీవనశైలికి ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు. ఆదివారం జరుగనున్న ర్యాలీ, బహిరంగ సభలకు ఆటో కార్మికులు పెద్దఎత్తున వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంగా శ్రీనివాసరావు, రాంప్రసాద్, జంగాల చైతన్య, యశ్వంత్, యూసూబ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ జీవితం ఆదర్శప్రాయం: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ వీరుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు, ప్రజా సేవకుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా తాతిపూడి గ్రామంలో జన్మించిన సర్దార్ చిన్న వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకుని జాతీయోద్యమంలో అమూల్యమైన సేవలందించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పలు సార్లు మంత్రిగా పనిచేసి రైతులు, పేదలు, వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారని చెప్పారు. ప్రజాసేవలో ఆయన చూపిన నిజాయితీ, త్యాగం, అంకితభావం కారణంగానే ప్రజల నుంచి 'సర్దార్' బిరుదు పొందారని తెలిపారు. సర్దార్ జీవితం ఆదర్శప్రాయమని, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని ఆయన చూపిన మార్గం ఈ తరాలకు ప్రేరణగా నిలుస్తోందని అన్నారు. ప్రజల రక్షణ, న్యాయం, సేవ అనే విలువలతో ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, సీఐలు బిలాలుద్దీన్, నిస్సార్ బాషా, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.